క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

కోదాడ : పట్టణ పరిధిలోని టీచర్స్ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో శనివారం వాసవి యూత్ క్లబ్ సభ్యులు విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం వీధి వ్యాపారులకు ఉచితంగా గొడుగులు అందజేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ చేపట్టిన డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా కోదాడలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వాసవీ యూత్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మడి అనంతచక్రవర్తి, డాక్టర్ వంగవేటి భరత్‌చంద్ర తెలిపారు. కార్యక్రమాలో బెతిదే భరత్‌కుమార్, నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఎరువుల యాజమాన్యం కీలకం



రైతులకు క్రిబ్‌కో బయో ఎరువు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సూర్యం

కోదాడరూరల్ : వ్యవసాయంలో ఎరువుల యాజమాన్యం కీలకమని కాపుగల్లు పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, క్రిబ్‌కో ఉమ్మడి నల్లగొండ జిల్లా సేల్స్ ఆఫీసర్ నవీన్‌రెడ్డిలు అన్నారు. శనివారం కాపుగల్లు పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా క్రిబ్‌కో బయోఫర్టిలైజర్ వాడటం ద్వారా పంటకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మహేష్, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

‘లబ్ధిదారులకు అందని గ్యాస్ సబ్సిడీ’

గరిడేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అందించే గ్యాస్ సబ్సిడీ అనేకమంది లబ్ధిదారులకు అందడం లేదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని చెప్పుకుంటున్నా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని తెలిపారు. లబ్ధిదారులకు సబ్సిడీ అందకపోవడంతో గ్యాస్ కంపెనీలు, ఏజెన్సీలకు లాభం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వినియోగదారులకు లాభం చేయాలనుకుంటే నేరుగా ఐదు వందలకు గ్యాస్ ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



నారాయణపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఇమామ్

నడిగూడెం : మిషన్ భగీరథ నీటి సరఫరాపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్ సంబంధిత సిబ్బందికి సూచించారు. శనివారం నడిగూడెం మండల పరిధిలోని నారాయణపురంలో సర్వేను ఆయన పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీఓ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



పాలకవీడులో సర్వే చేస్తున్న అధికారులు

పాలకవీడు : మిషన్ భగీరథ నీటి సరఫరాపై ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే పాలకవీడు మండలంలో కొనసాగుతోంది. శనివారం గ్రామాల్లో ఇంటింటి సర్వేను ఎంపీడీఓ లక్ష్మి, ఎంపీఓ దయాకర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే 84 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేస్తామన్నారు. ప్రతీ ఇంటికి నల్లా బిగింపు, నీటి సరఫరా, నల్లా ఉండి నీళ్లు రాకపోవడం, నల్లాలు బిగించకపోవడం వివరాలను ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశావర్కరు పాల్గొన్నారు.

సంత వేలం

తుంగతుర్తి : మండల కేంద్రంలో వారాంతపు సంతకు శనివారం వేలంపాట నిర్వహించారు. అనంతుల వెంకన్న రూ.7,74,000లకు వేలం దక్కించుకున్నాడు. ప్రత్యేక అధికారి రమాణారెడ్డి మాట్లాడారు. గత సంవత్సరం ఈ సంత వేలంపాట రూ.6,59,000 ఉండగా ఈ సంవత్సరం అదనంగా రూ.1,25,000 వచ్చాయని తెలిపారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

- ఎనిమిదేళ్ల క్రితం గోపాలమిత్ర భవన నిర్మాణం ప్రారంభం
- నిధులు సరిపోక మధ్యలోనే అంతర్గత పనులకు బ్రేక్
- జెడ్పీ నిధులు రూ.3 లక్షలతో ఇటీవల పూర్తి చేసిన అధికారులు
- 20 లోపు ప్రారంభించేందుకు ఏర్పాట్లు



కూచిపూడిలో నిర్మించిన గోపాలమిత్ర భవనం

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడి గోపాలమిత్ర భవనం పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో నాటి ప్రభుత్వం పశువైద్య శాఖ నుంచి గోపాలమిత్ర నిధులతో గోపాలమిత్ర భవనాల నిర్మాణాలకు నాంది పలికింది. వాటిల్లో సిబ్బందిని కూడా నియమించింది. దీంతో అనేక గ్రామాల్లో పాడి రైతులు, జీవాల పెంపకందారులు దూర ప్రాంతాల్లో ఉండే పశువైద్యాశాలలకు వెళ్లాల్సిన సమస్య తప్పింది. కానీ కూచిపూడిలో మాత్రం భవన నిర్మాణానికి నిధులు సరిపడ లేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా..

కూచిపూడి గ్రామ శివారులో దాదాపు ఎనిమిదేళ్ల కిందట రూ.7.50 లక్షలతో గోపాలమిత్ర భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. నిధులు ఉన్నంత వరకు పనులు చకచకా జరిగాయి. కానీ నిర్మాణం పూర్తయ్యాక ఎలక్ట్రికల్ వర్క్, శానిటేషన్, ఫ్లోరింగ్ వంటి పనులు మిగిలిపోయాయి. దీంతో భవనం ఎనిమిదేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు.

రూ.3 లక్షల జెడ్పీ నిధులతో..

మూడు నెలల క్రితం జెడ్పీటీసీ సభ్యురాలు మందలపు కృష్ణకుమారి తన నిధుల నుంచి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని రూ.3లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో ఫ్లోరింగ్, టాయిలెట్స్ టైల్స్, ఎలక్ట్రికల్ వంటి పనులను పూర్తి చేసి ఈ నెల 20 లోపు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.

జెడ్పీ నిధులతో పనులు పూర్తి చేశాం



గ్రామంలో ఎనిమిదేళ్లుగా గోపాలమిత్ర భవన నిర్మాణ పనులు పూర్తిగాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రూ.3 లక్షల జెడ్పీ నిధులు కేటాయించి పూర్తి చేశాం. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చొరవతో పశువైద్య సిబ్బందిని కూడా నియమించుకుంటాం.

– మందలపు కృష్ణకుమారి, జెడ్పీటీసీ, కోదాడ

20 లోపు ప్రారంభిస్తాం



కూచిపూడి గ్రామంలో గోపాలమిత్ర భవనంలో నిలిచిపోయిన ఫ్లోరింగ్, శానిటేషన్ పనులను జెడ్పీ నిధులతో పూర్తి చేశాం. ఈ నెల 20 లోపు ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– జివ్వాజి రాము, పీఆర్ ఏఈ, కోదాడ

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రథం సంస్థ ప్రతినిధులు

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రథం సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి మంగళగిరి సుధాకర్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీనివాసపురంలో గల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాలను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలతో విద్యార్థులు పఠనాసామర్థ్యం పెంచుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి పది జిల్లాల్లోని విద్యార్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కోఆర్డినేటర్ అనసూర్య, ఉపాధ్యాయులు బుర్రా వెంకటేశ్వర్లు, చిక్కుళ్ల గోవింద్, మంజుల, జానీబేగం, రవికిషోర్, మాస్టర్ వేణు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలం



రాస్తారోకో చేస్తున్న జాతీయ మహిళా సమాఖ్య నాయకులు

హుజూర్‌నగర్ : దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. పెద్దపల్లిలో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం హుజూర్‌నగర్‌లో జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికపై అత్యాచారం, హత్య ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు. మహిళలకు రోజురోజుకూ రక్షణ కరువు అవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు దేవరం సుజాత, నాయకురాళ్లు ఎస్‌కే.రేష్మ, ఎస్‌కే.మీరా, ఇందిరాల సంధ్య, జడ వెంకటమ్మ, జడ లక్ష్మి, షేక్ మీరాబీ, కుర్ర వీరమ్మ, మునగ మంగమ్మ, పుల్లమ్మ, సోమగారి తిరుపతమ్మ, అమరబోయిన వీరమ్మ, రాపర్తి మంగమ్మ, కస్తాల కనకమ్మ, కోటేశ్వరమ్మ, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

కల్నల్ సంతోష్‌బాబు త్యాగం చిరస్మరణీయం



సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : దేశరక్షణ కోసం కల్నల్ సంతోష్‌బాబు చేసిన త్యాగం చిరస్మణీయమని పలువురు ప్రముఖులు అన్నారు. శనివారం సంతోష్‌బాబు వర్ధంతి సందర్భంగా కోదాడ పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్, వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికులు తమ జీవితాలను పణంగా పెట్టి రక్షణగా నిలవడం ద్వారానే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని అన్నారు. నేటి యువకులు సైనికులను ఆదర్శంగా తీసుకొని దేశరక్షణకు పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రముఖులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన భవనం కూల్చివేయాలి



ఎంపీడీఓ, ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పార్వతి

మునగాల : మండల కేంద్రంలోని గణపవరం రోడ్డులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉందని, భవనాన్ని కూల్చివేయాలని గతంలో జిల్లా పరిషత్ సీఈఓ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పార్వతీబాయి కోరారు. ఈమేరకు శనివారం స్థానిక ఎంపీడీఓ, ఎంపీపీలకు ఆమె వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల భవనం వర్షాలకు కూలే ప్రమాదముందని తెలిపారు. భవనం శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని గతంలో మునగాలను సందర్శించిన సీఈఓ దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. సీఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ త్వరలో పాఠశాలను సందర్శించి పాఠశాల భవనం దుస్థితిని పరిశీలించనున్నట్లు తెలిపారు. తక్షణమే భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆమె కోరారు. ఆమె వెంట సామాజిక కార్యకర్త గంధం సైదులు ఉన్నారు.

దేశ భవిష్యత్‌ను మార్చేది సోషలిజమే



మాట్లాడుతున్న మేదరమెట్ల వెంకటేశ్వరరావు

కోదాడరూరల్ : దేశ భవిష్యత్‌ను మార్చేది సోషలిజమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని వర్తక సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సీపీఎం శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో దోపిడీ, పీడన, వివక్షత, అణచివేత ఉన్నంతకాలం ఎర్రజెండా అండగా ఉంటు అజేయంగా నిలుస్తుందని తెలిపారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులేనని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడంతోనే ఆ పార్టీని ఓడించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీల్లో రెండు మాత్రమే అమలవుతున్నాయని మిగిలిన వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు పాల్గొని కార్యకర్తలకు పలు విషయాలను బోధించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ముత్యాలు, మట్టిపల్లి సైదులు, జుట్టుకొండ బసవయ్య, జె.నరసింహారావు, రాపోలు సూర్యనారాయణ, అలసగాని బ్రహ్మయ్య, నాగటి చిన్నరాములు, డాక్టర్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలని వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీలో హరితహారం, మొక్కల కొనుగోలు, నర్సరీల నిర్వహణ పేరుతో 2014 నుంచి వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. అవినీతిపై విచారణ జరిపించాలని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో నర్సరీలు నిర్వహిస్తూనే బయటి ప్రాంతాల నుంచి మొక్కలు ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందని అన్నారు. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలులో లక్షల రూపాయల అవినీతి జరిగిందని తెలిపారు. ట్రాక్టర్‌ల కొనుగోలు కాంట్రాక్టు బీఆర్ఎస్ నాయకుడికి ఇచ్చి నాసి రకం ట్రాక్టర్‌లను కొనుగోలు చేశారని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్ కౌన్సిలర్లకే మ్యాన్ పవర్ ఏజెన్సీ కాంట్రాక్టు ఇచ్చి ఒక్కొక్క నిరుద్యోగి వద్ద 2 నుంచి 3 లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ప్రతి పనిలో మున్సిపల్ చైర్‌పర్సన్ చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. గత పదేళ్ల నుంచి మున్సిపాలిటీలో జరిగిన కేటాయింపులు, చెల్లింపుల వివరాలను ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు వేములకొండ పద్మ, నామ అరుణ, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ధరావత్ రవి, అన్నెపర్తి రాజేష్, ఎలిమినేటి అభినయ్, అనంతుల యాదగిరి గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల వీరమల్లు యాదవ్, కుంభం రాజేందర్, చిరివెళ్ల శభరి, మకట్ లాల్, లింగ నాయక్ పాల్గొన్నారు.

ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులు నడపొద్దు

మిర్యాలగూడ : ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను నడిపితే ఆ బస్సులను సీజ్ చేయడంతో పాటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంవీఐ వీరస్వామి అన్నారు. శనివారం స్థానిక ఆర్టీఏ కార్యాలయంలో స్కూల్ బస్సుల ఫిట్నెస్‌ను ఆయన పరీక్షించి మాట్లాడారు. మిర్యాలగూడ రవాణా శాఖ పరిధిలో 230 స్కూల్ బస్సులు ఉండగా ఇప్పటివరకు 165 బస్సులకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 65 బస్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందలేదన్నారు. ఫిట్నెస్ లేని బస్సుల్లో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తామన్నారు. స్కూల్ బస్సుకు సంబంధించి అన్ని భాగాలు సక్రమంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా స్కూల్ బస్సులో ఫైర్ సేఫ్టీ సిలిండర్, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలన్నారు. త్రైమాసిక పన్ను చెల్లించాలని, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్‌తోపాటు పొల్యూషన్ సర్టిఫికెట్, పర్మిట్ వంటి అన్ని ధృవపత్రాలు ఉండాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామాజిక సేవలో వాసవి క్లబ్ ముందంజ



వాసవి, వనితా క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ రాచర్ల కమలాకర్



ప్రభుత్వ పాఠశాలకు నీటిట్యాంకులు అందజేస్తున్న వాసవి, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : సామాజిక సేవలు అందించడంలో వాసవి క్లబ్ ముందుందని ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాచర్ల కమలాకర్ అన్నారు. శనివారం నేరేడుచర్ల శివాలయంలో నిర్వహించిన నేరేడుచర్ల వాసవి, వనితా క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ క్లబ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లక్షలాది మంది సభ్యులతో కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవి క్లబ్‌లో ఆర్యవైశ్యులు మాత్రమే సభ్యులుగా ఉన్నప్పటికీ అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. పలుమార్లు రాష్ట్రపతి నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న ఘనత వాసవి క్లబ్‌దేనని తెలిపారు. ముందుగా వాసవి, వనితా క్లబ్‌ల నూతన అధ్యక్షులుగా గెల్లి నర్సింహారావు, గెల్లి లక్ష్మీప్రసన్న, ప్రధాన కార్యదర్శులుగా జూలూరు అశోక్, చెరుకు కవిత, కోశాధికారిగా తాళ్లూరి శ్రీనివాస్, గరిణె జ్యోతిలతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం క్లబ్ ఐఈసీ కీర్తన అధ్వర్యంలో డాన్ టూ డెస్క్ పేరుతో పలు ప్రభుత్వ పాఠశాలలకు నీటి ట్యాంకర్లు, వీధి వ్యాపారులకు గోడుగులు, నిరుపేద వృద్ధులకు చేతి కర్రలు, విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా ఉత్తమ సేవలు అందించిన పలువురు కానిస్టేబుళ్లను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట మహిళా ఉపాధ్యక్షురాలు గెల్లా కృష్ణవేణి, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గరిణె అరుణ, డిస్ట్రిక్ పీఆర్ఓ రాయపూడి భవాని, బిక్కుమళ్ల కృష్ణ, తవంగవీటి రమేష్, లక్ష్మయ్య, చిత్తనూరు సత్యనారాయణ, వేణుమాధవ్, శ్రీలత, కందిబండ శ్రీనివాస్‌రావు, రమేష్, నటరాజ్, రాచకొండ శ్రీనివాస్‌రావు, మాశెట్టి సైదయ్య, పరమేశం, నీలా రామ్మూర్తి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

చికెన్ షాపు యజమానిపై ఫిర్యాదు

మోతె : మండలంలోని ఉర్లుగొండలోని ప్రభుత్వ భూమిలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తిపై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి శనివారం మోతె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యదర్శి తెలిపిన వివరాలు.. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పక్కన గల ప్రభుత్వ భూమిలో కట్ల ఉప్పలయ్య గత కొంత కాలంగా చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. దీంతో దుర్వాసన వెలువడుతుండడంతో పక్కన పాఠశాల విద్యార్థులు, బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చికెన్ షాపు మూసివేయించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి సదరు యజమానికి నోటీసులు జారీ చేశారు. కానీ ఉప్పలయ్య గ్రామ పంచాయతీ నోటీసులను సైతం లెక్కచేయకుండా ప్రభుత్వ భూమిలోనే చికెన్ షాపు నిర్వహిస్తున్నాడు. దీంతో పంచాయతీ కార్యదర్శి మోతె పోలీస్ స్టేషన్‌లో చికెన్ షాపు యజమానిపై ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

కోదాడరూరల్ : ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చేపట్టి, గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని యువజన సంఘాల జిల్లా కన్వీనర్ జె.నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో యూనిఫాం, పుస్తకాలు అమ్మకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రైవేటు పాఠశాలల బస్సులపై నిఘా పెంచాలని, పర్మిట్‌లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జె.సాయి, నాగరాజు, నవదీప్, వీరేష్ తదితరులు ఉన్నారు.

17న కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీవిజన్ లేజర్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు, జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీకార్డు కలిగిన వారు తమ హెల్త్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డులను తీసుకొచ్చి వైద్యసేవలు పొందాలని సూచించారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి స్థలం పరిశీలన

పాలకవీడు : పాలకవీడు మండలం ఏర్పడి ఏడు సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు శనివారం మండల కేంద్రం శివారులోని సర్వే నంబర్ 49లో ప్రభుత్వ భూమిని అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భూక్యా గోపాల్ మాట్లాడుతూ.. తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని సర్వే చేసి గుర్తించినట్లు తెలిపారు. జెడ్పీటీసీ బుజ్జీ మోతీలాల్, ఎంపీడీఓ లక్ష్మి, ఎస్సై లక్ష్మీనర్సయ్య, సర్వేయర్ ఖాజామొహినుద్దీన్, ఎంపీఓ దయాకర్, పీఆర్ ఏఈ ప్రదీప్, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మిర్యాలగూడ : గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే విజేత కళాశాల లక్ష్యమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్‌ఎన్ ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 25 మంది ఇంటర్మీడియట్ విద్యార్హతతో, 16 మంది డిగ్రీ విద్యార్హతతో పాల్గొన్నారని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో 19 మంది, డిగ్రీ అర్హతతో 14 మంది ఎంపికకాగా వారికి నియామకపత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.మధు, పి.స్వామినాయక్, డి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సమాయత్తం



రేపూరులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు



మేళ్లచెరువులో నాగలితో పొలం దున్నుతున్న రైతు

- దుక్కులు దున్నే పనిలో నిమగ్నం
- కొన్ని గ్రామాల్లో విత్తనాలు విత్తుతున్న రైతన్నలు
- ఆరుతడి పంటలపైనే ఎక్కువ ఆసక్తి

మేళ్లచెరువు : మండలంలోని రైతులు వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్నారు. గత కొన్ని రోజులుగా అప్పుడప్పుడు కొద్దిపాటి వర్షాలు పడుతుండడంతో భూమి తడిసింది. దీంతో మెట్ట పైర్ల సాగుకు దుక్కులు దున్నే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. వర్షంపై ఆధారపడి సాగు చేసే పత్తి, మిరప, కంది పంటలు వంటివి వేసే రైతులు భూమిని చదును చేసి దుక్కులు దున్నుతున్నారు. ఇక కొన్ని గ్రామాల్లో విత్తనాలు కూడా విత్తుతున్నారు. మండలంలో రైతులు ఆరుతడి పంటలైన పత్తి, మిరప పంటలు పండించడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మండలంలో 10 వేల ఎకరాలల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో మిరప, 4 వేల ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో కంది ఇతర పంటలు సాగు చేయనున్నట్లు అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కాగా, ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు సరిపోవని, అంతేకాకుండా పత్తి, మిరప విత్తనాలు ప్రభుత్వం నుంచి సరిగా అందవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు వరి సన్నరకాలు, కంది, పెసలు వంటి విత్తనాలు సకాలంలో అందక ప్రైవేటు విత్తన డీలర్లను ఆశ్రయించాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



మేళ్లచెరువు పీఏసీఎస్‌లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. పచ్చిరొట్ట ఎరువునిచ్చే జీలుగ విత్తనాలు, వేపతో కూడిన యూరియా, డీఏపీ, సూపర్ పాస్ఫెట్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేటు డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తే బిల్లులు తీసుకోవాలి.

– పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఏఓ, మేళ్లచెరువు